## నేటి నుంచి ఫేస్ రికగ్నిషన్ ద్వారా హాజరు



జడ్పీ కార్యాలయంలో ఫేస్ రికగ్నిషన్ పరికరం

హాజీపూర్, జూన్ 20 : మంచిర్యాల జడ్పీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో శనివారం నుంచి ఫేస్ రికగ్నిషన్ ద్వారా హాజరు విధానాన్ని అమలు చేయనున్నరు. అందులో భాగంగా పరికరాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. జడ్పీ కార్యాలయంలో 26 మంది, జిల్లాలోని 16 ఎంపీడీవో కార్యాలయాల్లో 170 మంది అధికారులు, సిబ్బంది ఉన్నట్లు అంచనా వేశారు. ఉద్యోగుల సమయ పాలన, విధుల్లో పారదర్శకత కోసం ఈ విధానాన్ని అమలు చేయాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సంచాలకురాలు సృజన ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 16 నుంచే అమలు చేయాల్సి ఉండగా, పరికరాల కొనుగోలు, అమర్చడంలో జాప్యం జరిగింది. గత మంగళవారం పరికరాలు జడ్పీ కార్యాలయానికి చేరుకోగా, ఉద్యోగుల వివరాలను అప్‌లోడ్ చేసి, నేటి నుంచి వినియోగంలోనికి తీసుకరానున్నారు. గతంలో బయోమెట్రిక్ (వేలి ముద్ర) హాజరు విధానం అమలులో ఉండేది. అది సక్రమంగా పనిచేయకపోడంతో కొన్ని ప్రాంతాల్లో హాజరు నమోదుకు తప్పటడుగులు వేయడం లాంటి ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత మూలకుపడి పోవడంతో ఆఫ్‌లైన్ విధానంలో హాజరు కొనసాగుతున్నది. విధుల్లో నిర్లక్ష్యం, సమయపాలన పాటించకపోవడం, విధుల్లో లేకున్నా సంతకాలు చేయడం వంటివి వెలుగుచూశాయి. అందులో భాగంగానే ఫేస్ రికగ్నిషన్ హాజరు విధానాన్ని అమల్లోనికి తీసుకవచ్చినట్లు తెలుస్తున్నది.

## అనాథలకు అండగా బాల రక్షా భవన్

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 20 : అనేక కారణాల వల్ల అనాథలుగా మారిన పిల్లలకు బాల రక్షా భవన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సంక్షేమాధికారి భాస్కర్ అన్నారు. డీసీపీవో కార్యాలయంలో కొవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన ఏడుగురు పిల్లలతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా బాలల రక్షణ అధికారి మహేశ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇలాంటి పిల్లల కోసం అనేక వసతులు ఏర్పాటు చేస్తున్నదని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీరికి స్పాన్సర్‌షిప్ పథకం కింది ఒక్కొక్కరికి నెలకు రూ.4 వేలు, ఒక్కొక్కరికీ స్టేషనరీ, పుస్తకాలు, యూనిఫాం, షూ కొనుక్కునేందుకు ఏడాదికి రూ.20 వేలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. పీఎంకే కింద నమోదైన వీరికి 23 ఏళ్ల అనంతరం రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. సిబ్బంది శ్రావణ్ కుమార్, చంద్రశేఖర్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో సభ్యులు

మంచిర్యాల టౌన్, జూన్ 20 : గుజరాత్ రాష్ట్రంలో 28 నుంచి జూలై 2 వరకు జరిగే హ్యాండ్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు మంచిర్యాల జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. మందమర్రిలో ఏప్రిల్ 2, 3, 4వ తేదీల్లో జరిగిన 54వ సీనియర్ మహిళల రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు తరపున ప్రతిభ చూపగా, మొదటి స్థానంలో నిలిచింది. వేమనపల్లి మండలానికి చెందిన పోల్కా అనూష, బెజ్జూర్ మండలానికి చెందిన జ్యోతి, మంచిర్యాలకు చెందిన శృతి, కాగజ్‌నగర్‌కు చెందిన ఊర్వశి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యామ్ సుందర్ రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, కోచ్ సునార్కర్ అరవింద్, ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కోశాధికారి రమేశ్ రెడ్డి, రాకేశ్, సాయి, గురువేందర్‌తో, జిల్లా సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

## జీవో 49 రద్దు చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 20 : జీవో 49 రద్దు చేసి, ఆదివాసుల మనుగడను కాపాడాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్టీ నాయకుల రాజకీయ శిక్షణ తరగతులకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టైగర్ కారిడర్ పేరుతో ఆదివాసులు సాగుచేస్తున్న భూముల నుంచి, వారు నివసిస్తున్న ప్రాంతాల నుంచి దూరం చేసి, కార్పొరేట్ కంపెనీలకు అడవులు కట్టబెట్టేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీవో 49 తీసుకువచ్చాయని ఆరోపించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవి కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్, శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ఆనంద్ కుమార్, కార్తీక్, టీకానంద్, రాజేందర్, మాలాశ్రీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాసిపేట 2 ఇంక్లైన్‌పై గేట్ మీటింగ్

కాసిపేట, జూన్ 20 : మందమర్రి ఏరియా కాసిపేట 2 గనిలో పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్ అధ్యక్షతన ఏఐటీయూసీ గేట్ మీటింగ్ నిర్వహించారు. అధ్యక్షుడు, శాశ్వత వేజ్‌బోర్డు సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, కార్మిక చట్టాలు మార్చి కార్మికులపై పని భారం పెంచే కుట్రలకు వ్యతిరేకంగా జూలై 9వ తేదీన జరిగే ఒక్క రోజు సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలలో కార్మికులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ అక్బర్ అలీ, సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేశ్, శైలేంద్ర సత్యనారాయణ, భీమనాథుని సుదర్శన్, ఎగ్గెటి రాజేశ్వరరావు, రత్నం ఐలయ్య, పిట్ సెక్రటరీ గొల్ల శ్రీనివాస్, గని పిట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ కొండపల్లి నర్సయ్య, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ బొద్దుల వెంకటేశ్, వర్క్‌మన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ చారి, రాజ్‌కుమార్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన, జూన్ 20 : గోలేటి సీహెచ్‌పీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఐఎన్టీయూసీ సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ సంగెం ప్రకాశ్‌రావు కోరారు. సీహెచ్‌పీలో శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులను కలిసి, మాట్లాడారు. అనంతరం సీహెచ్‌పీ ఇంజినీర్ కోటయ్యతో సమావేశమై, పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఏరియా సీనియర్ నాయకుడు నల్లగొండ సదాశివ్, ఏరియా కార్యదర్శి మాసాడి నారాయణ, ఏరియా చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గోలెం గట్టయ్య, ఖైర్‌గూడ పిట్ కార్యదర్శి భాస్కరాచారి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సోగాల వామన్, అసిస్టెంట్ కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు శ్యాంబాబు, రాజయ్య, అర్జయ్య పాల్గొన్నారు.

## సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలి

జైపూర్, జూన్ 20 : మండలంలోని రసూల్‌పల్లి నుంచి వరంగల్ వరకు నిర్మించే గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి టేకుమట్ల వద్ద సర్వీసు రోడ్డు ఇవ్వాలని టేకుమట్ల మాజీ సర్పంచ్ గోనె సుమలత ఆధ్వర్యంలో గ్రామస్తులు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి వివేక్‌కు వినతిపత్రం అందించారు. హైవేకు ఇరువైపులా సర్వీసురోడ్డు ఇవ్వడం వల్ల రైతులకు, పరిసర గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. స్పందించిన మంత్రి సంబదిత అధికారులతో మాట్లాడి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## వాణిజ్య దుకాణాలకు టెండర్ నిర్వహించాలి

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 20 : ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వాణిజ్య సముదాయాలకు టెండర్ నిర్వహించాలని సీపీఐ పారీట జిల్లా కార్యవర్గసభ్యుడు చిరంజీవి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆర్డీవో లోకేశ్వర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఆసిఫాబాద్ మేజర్ గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు రాబడి నిమిత్తం వివేకానంద చౌక్‌లో 1995లో వాణిజ్య దుకాణా సముదాయాలు నిర్మించినట్లు తెలిపారు. అప్పటినుంచి టెండర్ నోటిఫికేషన్ వేసిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. 30 ఏళ్లుగా తక్కువ కిరాయితో కేవలం కొంతమంది చేతుల్లో వాణిజ్య దుకాణ సముదాయాలు ఉండడం శోచనీయమని తెలిపారు. తాళ్లపల్లి దివాకర్, ధర్మి రాకేశ్ ఉన్నారు.

# దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- ప్రజావాణిలో అందిన అర్జీలు త్వరగా పరిష్కరించాలి
- అధికారులతో సమావేశంలో మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్





మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, హాజరైన అధికారులు

నస్పూర్, జూన్ 20 : ప్రజావాణిలో అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రజావాణిపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పెండింగ్ దరఖాస్తులపై కారణాలు సమీక్షించి, త్వరగా పరిష్కరించాలన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను తరలించే వాహనాల సంబంధిత పర్మిట్, ఫిట్‌నెస్ పత్రాలను తనిఖీ చేయాలన్నారు. లేకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. అనుమతులు లేని నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి, సౌకర్యాలు, సమస్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు.

### కనీస కూలి అమలుకు చర్యలు..

మంచిర్యాల జిల్లాలో కనీస కూలీ ధరల అమలుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ చాంబర్‌లో ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్మికులను మూడువర్గాలకు విభజించినటుల తెలిపారు. ఇందులో అన్‌స్కిల్డ్ కార్మికులకు 2022-23లో మున్సిపల్ ప్రాంతంలో రూ. 478, నాన్ మున్సిపల్ ప్రాంతంలో రూ.434, ఏజెన్సీ ప్రాంతంలో రూ.516 చెల్లించినట్లు చెప్పారు. 2024-25, 2025-26లో మున్సిపల్ ప్రాంతంలో రూ.574, నాన్ మున్సిపల్ ప్రాంతలో రూ.521, ఏజెన్సీ ప్రాంతంలో రూ.619 చెల్లించేందుకు ప్రతిపాదించినట్లు వెల్లడించారు. సెమి స్కిల్డ్ కార్మికులకు 2022-23లో మున్సిపల్ ప్రాంతంలో రూ.569, నాన్ మున్సిపల్ ప్రాంతంలో రూ.545, ఏజెన్సీ ప్రాంతంలో రూ.638 చెల్లించినట్లు, ఏజెన్సీ ప్రాంతంలో 766 చెల్లించేందుకు ప్రతిపాదించినట్లు వివరించారు.

# ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలి



ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 20 : స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణ సదుపాయం కల్పించి, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తోడ్పాటు నందించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ రిసోర్స్ పర్సన్లు, మెప్మా సిబ్బందికి సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్లు, మెప్మా సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ 170 లక్ష్యం కాగా, ఇప్పటివరకు 12 గ్రూపుల వారు లింకేజీ పూర్తిచేశారని, మిగిలిన 158 స్వయం సహాయక సంఘాల లింకేజీ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. నూతన సంఘాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. కొత్తగా పెండ్లి అయిన వారిని గ్రూపులో సభ్యులుగా చేర్పించాలని, గ్రూపు సభ్యుల ఆధార్ సీడింగ్ ప్రక్రియలో 823 మందికి గాను, 819 మందికి పూర్తి చేశారన్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 170 మహిళా సంఘాలున్నాయని, ఆసిఫాబాద్ మున్సిపాలిటీ నూతనంగా ఏర్పాటనందున మెప్మా సిబ్బంది గ్రూపుల వివరాలను సమీక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ మోతీరాం, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, డీపీఎంలు, స్త్రీ నిధి మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక ప్రగతి సాధించాలి..

తిర్యాణి, జూన్ 20 : తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా రుణాలు పొందిన మహిళా సంఘాల సభ్యులు, సక్రమంగా వినియోగించుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని రిజర్వ్ బ్యాంక్ ఏజీఎం సభావత్ రాములు సూచించారు. మండల కేంద్రంలోని జంగుబాయి మండల సమాఖ్య కార్యాలయ ఆవరణలో శుక్రవారం మహిళా సంఘాల సభ్యులు, తెలంగాణ బ్యాంక్ ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యత ప్రగతిపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణ మొత్తాలను తిరిగి సక్రమంగా చెల్లిస్తే మరిన్ని రుణాలు తీసుకునేందుకు అర్హులవుతారన్నారు. రూ.20 లక్షల వరకు పూచికత్తు లేకుండా రుణ సౌకర్యం ఉందని సూచించారు. డిజిటల్ లావాదేవీలు జరిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా అభివృద్ధి (నాబార్డ్) అధికారి వీరభద్రుడు, టీజీబీ మేనేజర్ శ్రీనివాస్, ఆర్బీఐ సీఎఫ్ఎల్ క్లస్టర్ కో ఆర్డీనేటర్ రాజశేఖర్ గౌడ్, ఏపీఎం శ్రీనివాస్, కన్సీలర్స్ వనజారాణి, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### సద్వినియోగం చేసుకోవాలి..

కౌటాల, జూన్ 20 : మహిళా సంఘాల సభ్యులు రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ధముక ప్రభుదాస్ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో కౌటాల, ముత్తంపేట, రవీంద్రనగర్ టీజీబీ బ్యాంకు పరిధిలోని మహిళా సంఘాల సభ్యులకు రూ.5 కోట్ల 36 లక్షల 70 వేల చెక్కును అందించారు. చింతలమానేపల్లి మండలం కర్జెల్లి గ్రామానికి చెందిన చౌదరి ఓంకార్ ఇటీవల రైలు ప్రమాదంలో గాయపడగా, ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన రూ.10 లక్షల చెక్కును అందించారు. అదనపు డీఆర్డీవో రామకృష్ణ, డీపీఎం అన్నాజీ, బ్యాంక్ మేనేజర్లు రమేశ్, కిరణ్, రాజ్‌కుమార్, ఏపీఎంలు ముక్తేశ్వర్, దేవదానం, మండల సమాఖ్య అధ్యక్షురాలు కుసుమ, ఐకేపీ సిబ్బంది, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



తిర్యాణి : మాట్లాడుతున్న ఆర్బీఐ ఏజీఎం సభావత్ రాములు

# నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

చెన్నూర్ టౌన్, జూన్ 20 : ధృడమైన శరీరం, తీర్చిదిద్దినట్టుండే సౌష్టవం, చక్కటి ఆరోగ్యం, సంపూర్ణ ఆయుష్షు, మదినిండా ఆహ్లాదం, గుండె నిండా ధైర్యం.. తరగని ఆనందం.. ఇవన్నీ యోగాలో దొరుకుతాయి. ఇది హిందుత్వ, ఆధ్యాత్మిక సాధనల్లో ఒక భాగం. సమాజానికి సేవ చేయాలనే సత్సంకల్పం, సొంతలాభం కొంతమానుకొని పొరుగువారికి తోడ్పడవోయి.. అనే గురజాడ అప్పారావు మాటలు అక్షర సత్యాలు చేస్తున్నారు చెన్నూర్‌కు చెందిన మంచాల పద్మజ. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పలువురు ఆమె సేవలను కొనియాడుతూ అభినందిస్తున్నారు. చెన్నూర్ మండల కేంద్రంలోని పుప్పాల హనుమాన్ వీధికి చెందిన రాజాబాబు సతీమణి పద్మజ.. మహిళలు, పిల్లలకు ఉచితంగా యోగా, ధ్యానం, సత్సంగం, మంచి విషయాలు నేర్పిస్తూ మార్గదర్శంగా నిలుస్తున్నారు. పుప్పాల హనుమాన్, యోగా, ధ్యాన కేంద్రంగా ఐదేండ్లుగా ప్రతి రోజూ, వేసవి సెలవుల్లో సమయానుకూలంగా విద్యార్థులకు నేర్పిస్తున్నారు. పిల్లలకు రామాయణం, మహా భారతం, భాగవతంలోని పాత్రలు బోధిస్తున్నారు. రామాయణాన్ని పిల్లలు కంఠస్థం చేయడం గమనార్హం. వీటితో పాటు, సుమతీ పద్యాలు, దేశ భక్తి, దైవ భక్తి, భక్తి గీతాలు నేర్పిస్తున్నారు. క్విజ్ పోటీలు, మెదడుకు మేత పెట్టే పజిల్స్, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తూ బహుమతులు అందజేస్తున్నారు.

### ఘనంగా యోగా దినోత్సవం..

కౌటాల, జూన్ 20 : కౌటాలలోని మినీ స్టేడియంలో శుక్రవారం జనభవిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యోగా గురువులు దాసరి వినోద్ గౌడ్ పలు ఆసనాలు వేశారు. విద్యార్థులతో యోగాసన విన్యాసాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొమురం మాంతయ్య, ఎంఈవో గావుడే హన్మంతు, ఆయుష్ మెడికల్ అధికారి సంజయ్, జన భవిత ట్రస్ట్ అధ్యక్షుడు డీ సురేశ్, యోగా గురువు దౌలత్, కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, జూన్ 20 : శ్రీరాంపూర్ ఏరియా జీఎం కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులకు డీవైజీఎం(పర్సనల్) ఎస్ అనిల్‌కుమార్ యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. పీఎం రాజేశ్వర్, స్టాటా కంట్రోల్ ఆఫీసర్ కే శ్రీధర్, అమర్‌నాథ్‌రెడ్డి, డీవైపీఎం రాజేశ్, సీనియర్ పీవో కాంతారావు, యోగా గురువులు సాంబయ్య పాల్గొన్నారు.

రెబ్బెన, జూన్ 20 : బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీ, గోలేటి సీహెచ్‌పీ, ఏరియా దవాఖాన, ఏరియా స్టోర్స్, ఏరియా వర్క్‌షాప్‌లో జీఎం విజయభాస్కర్‌రెడ్డి యోగాపై అవగాహన కల్పించారు. యోగా శిక్షకులు రాజలింగు, రాజ్యలక్ష్మి, అలేఖ్య ఆధ్వర్యంలో ఆసనాలు వేశారు. ఏరియా ఎస్వోటూ జీఎం రాజమల్లు, అధికారుల సంఘం ప్రతినిధి ఉజ్వల్ కుమార్ బెహరా, ఏరియా ఇంజినీర్ రామనాథం, డీజీఎం(సివిల్) మదీన బాషా, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, పర్చేస్ అధికారి రవికుమార్, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సింగరేణి హైస్కూల్ మైదానంలో శనివారం జీఎం ఆధ్వర్యంలో మెగా యోగా క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎస్వోటూజీఎం రాజమల్లు తెలిపారు. సింగరేణి హైస్కూల్ క్రీడమైదానాన్ని ఏరియా అధికారులతో కలిసి పరిశీలించారు. యోగా ఆసనాలు వేసే ప్రదేశం, మొక్కలు నాటే ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచనలు చేశారు. ఎన్విరాన్‌మెంట్ అధికారి హరీశ్, సివిల్ ఈఈ రాజేంద్రప్రసాద్, సీనియర్ పీవో ప్రశాంత్ పాల్గొన్నారు.

## స్పాట్ అడ్మిషన్ ప్రారంభం

లక్షెట్టిపేట, జూన్ 20 : మంచిర్యాలలోని మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల (పురుషులు)లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను శుక్రవారం స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభించినట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్సీవో శ్రీధర్ తెలిపారు. ఇంటర్ అర్హత పొందిన విద్యార్థులు జూన్ 20 నుంచి 24వ తేదీ వరకు లక్షెట్టిపేటలోని మహాత్మా జ్యోతి బాపూలే కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివిధ కోర్సుల్లో ఖాళీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ బట్టు విజయ్ కుమార్ తెలిపారు. వివరాలకు 95055 20097, 96037 05803 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## ఓబీసీ పోరుబాట పుస్తకావిష్కరణ

మంచిర్యాల (ఏసీసీ), జూన్ 20 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో 22న ఓబీసీల పోరుబాట పుస్తకావిష్కరణ, పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జన అధికార సమితి నేతలు శుక్రవారం ప్రకటించారు. ఓబీసీ హక్కులు, రాజ్యాంగ హామీలు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం జరుగుతున్న పోరాటాలను విపులంగా వివరిస్తూ ఈ పుస్తకాన్ని రచయిత పరికిపండ్ల నరహరి(ఐఏఎస్) రాశారని పేర్కొన్నారు. బీసీలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

## ఇంకుడు గుంతల పరిశీలన

హాజీపూర్, జూన్ 20 : ఉపాధి హామీ 2024-25లో భాగంగా వివిధ జీపీల్లో నిర్మించిన ఇంకుడు గుంతలను శుక్రవారం జల్ శక్తి అభియాన్ శాస్త్రవేత్త, నోడల్ అధికారి కొల్లి రాంబాబు పరిశీలించారు. ఈ నిర్మాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. డీఆర్డీవో కిషన్, డీఆర్డీఏ బృందం, హాజీపూర్ ఎంపీడీవో ప్రసాద్, ఏపీవో మల్లయ్య, సదానందం, టీఏలు, ఈసీ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్థికసాయం

రామకృష్ణాపూర్, జూన్ 20 : రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ గోగర్ల భీమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, పట్టణ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.10 వేల సాయం అందచేశారు. అతడి కుటుంబానికి యూనియన్ ద్వారా సేకరించిన నగదు అందించినట్లు పేర్కొన్నారు. గౌరవాధ్యక్షుడు గాండ్ల సమ్మయ్య, అధ్యక్షుడు ఎనగంటి సంపత్, ఉపాధ్యక్షుడు పాక అంజయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ముగిసిన రెవెన్యూ సదస్సులు

దండేపల్లి, జూన్ 20 : భూ భారతి రెవెన్యూ సదస్సులు శుక్రవారంతో అన్ని గ్రామాల్లో ముగిసినట్లు తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే తెలిపారు. మండలంలోని 31 రెవెన్యూ గ్రామాల్లో 892 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. శుక్రవాం కన్నెపల్లిలో సదస్సు నిర్వహించారు.

## విగ్రహావిష్కరణ జయప్రదం చేయండి

దహెగాం, జూన్ 20 : సిర్పూర్ నియోజకవర్గంలోని చిన్నగుడిపేటలో శుక్రవారం ప్రముఖ సాహితీవేత్త సామల సదాశివ్ మాస్టారు విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు దందర మల్లేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ముఖ్య అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

దండేపల్లి, జూన్ 20 : దండేపల్లి మండలం రెబ్బెన్‌పెల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంకు చెందిన కవి ముల్లపూడి కిషోర్‌కుమార్, హైదరాబాద్‌కు చెందిన కిరణ్ కుమార్ అందించిన రూ.15వేల విలువైన బ్యాగులను ఎంఈవో చిన్నయ్య శుక్రవారం అందజేశారు. కాంప్లెక్స్ హెచ్ఎం మంత్రి రాజు, పాఠశాల హెచ్ఎం రాజేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు నర్సయ్య వాణి, మీనాక్షి ఉన్నారు.

## ఎమ్మార్పీఎస్ కార్యవర్గం

దహెగాం, జూన్ 20 : ఎమ్మార్పీస్ దహెగాం మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధికార ప్రతినిధి రేనుకుట్ల మహేశ్ తెలిపారు. అధ్యక్షుడిగా జిల్లపెల్లి మహేశ్ మాదిగ, కో ఇన్‌చార్జిగా ఆయిల్ల శంకర్ మాదిగ, సభ్యులుగా బందరుకంటి రాకేశ్ మాదిగ, శనిగారపు శేఖర్ మాదిగ, సిపల్లి బుచ్చయ్య మాదిగ, చాపల వెంకటేశ్ మాదిగ, శనిగారపు సాయికిరణ్ మాదిగ, చాపల శంకర్, భీమేశ్ మాదిగ ఎన్నికయ్యారు. జిల్లా ఇన్‌చార్జి దామస్ మాదిగ, మల్లేశ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## కొలాంగూడ గిరిజనులకు అవగాహన

జన్నారం, జూన్ 20 : కొత్తపేట జీపీ పరిధి కొలాంగూడ గిరిజనులకు ప్రధాన మంత్రి జన్మన్ పథకంపై శుక్రవారం ఎంపీడీవో ఉమర్ షరీఫ్, జిల్లా గిరిజన క్రీడాల అధికారి బండ జీవరత్నం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. గిరిజన గూడేలకు వెళ్లేందుకు రోడ్డు, విద్యుత్, మొబైల్ సిగ్నల్, తాగునీరు, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, కిసాన్‌కార్డులు, బ్యాంక్ ఖాతాలు తెరువడం, భూ సమస్యలు పరిష్కరించి, పంట రుణాలు అందేలా చూస్తామని పేర్కొన్నారు.

## నర్సాపూర్ జీపీ సందర్శన

తాండూర్, జూన్ 20 : నర్సాపూర్ జీపీని శుక్రవారం ఎంపీవో అనిల్‌కుమార్ సందర్శించారు. నిత్యం పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టాలని కార్యదర్శి, సిబ్బందిని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. సరుకులు తనిఖీ చేశారు. కార్యదర్శి జగదీశ్, సిబ్బంది ఉన్నారు.

## శిక్షణలో అందరూ పాల్గొనాలి

నస్పూర్, జూన్ 20 : ఇన్‌స్పైర్ మనక్ పథకంపై 23న టెలికాన్ఫరెన్స్ శిక్షణ ఉంటుందని, ప్రధానోపాధ్యాయులు పాల్గొనాలని మంచిర్యాల డీఈవో యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా విద్యార్థుల ప్రాజెక్టుల నామినేషన్ల సెప్టెంబర్ 15 వరకు నమోదు చేసేందుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. 23న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు టీ శాట్ ద్వారా శిక్షణ ఉంటుందని, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

## కిష్టాపూర్‌లో ఎంపీ పర్యటన

జైపూర్, జూన్ 20 : జైపూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ పర్యటించారు. పెద్దపల్లి జిల్లా సుందిళ్లలో పర్యటించిన ఆయన, బ్యారేజీ మీదుగా కిష్టాపూర్ గ్రామాన్ని సందర్శించారు. రసూల్‌పల్లి నుంచి వరంగల్ వరకు నిర్మిస్తున్న 163జీ రహదారి పనులను పరిశీలించారు. హైవేకు సర్వీసురోడ్డు, ఎగ్జిట్‌లు ఇవ్వకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతారని సర్వీసురోడ్డు, ఎగ్జిట్‌ల ఏర్పాటుకు కృషిచేయాలని స్థానిక నాయకులు ఎంపీకి విన్నవించారు.

## ఫలించిన యూటీఎఫ్ పోరాటం

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 20 : ఉపాధ్యాయ నియామకాల్లో భాగంగా నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులకు అక్టోబర్ 10 నుంచి సర్వీస్ కౌంట్ చేసి వేతనాలు చెల్లించాలని చేసిన పోరాటం ఫలించిందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతి కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 నెలలుగా తమ సంఘం ఆధ్వర్యంలో నిరంతర కృషిచేశామని పేర్కొన్నారు. నూతనంగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన వారికి అక్టోబర్ 10 నుంచి సర్వీస్ కౌంట్ చేస్తూ వేతనాల బిల్లులను అనుమతించాలని ట్రెజరీ అధికారులకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సూల్తానియా ఉత్తర్వులు జారీ చేయడంతో హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

## బహిరంగ వేలం వాయిదా

చెన్నూర్ టౌన్, జూన్ 20 : చెన్నూర్ పట్టణంలోని మదనపోచమ్మ ఆలయంలో పలు వస్తువుల అమ్మకం కోసం నిర్వహించే బహిరంగ వేలం వాయిదా వేసినట్లు ఆలయ ఈవో ముక్త రవి తెలిపారు. శుక్రవారం దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో వేలం వేయాల్సి ఉండగా, ఎవరూ రాకపోవడంతో 27వ తేదీకి వాయిదా వేసినట్లు వివరించారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి, శీతల పానియాలు, కిరాణా సామగ్రి, ఆట వస్తువులు అమ్ముకునే హక్కు కోసం డిపాజిట్ (ధరావత్ సొమ్ము) రూ.50 వేలు చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

మందమర్రి, జూన్ 20 : మందమర్రి మున్సిపాలిటీ పరిధి ఊరు మందమర్రి గ్రామ సమీపంలోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద శుక్రవారం పోలీసులు వ్యవసాయ అధికారులతో కలిసి నిర్వహించిన తనిఖీల్లో 40 కిలోల పత్తి విత్తనాలను పట్టుకున్నారు. మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. నకిలీ పత్తి విత్తనాలను అక్రమంగా రైతులకు విక్రయించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారనే సమాచారం మేరకు మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, విస్తరణాధికారి ముత్యం తిరుపతితో కలిసి పోలీసులు తనిఖీలు చేపట్టారు. ట్యాంక్‌బండ్ వద్ద బైక్‌పై వెళుతున్న బురదగూడెం గ్రామానికి చెందిన ముంద్రు మణి, మువ్వ గౌతం వద్ద తనిఖీ చేయగా, 40 కిలోల నకిలీ విత్తనాలు పట్టుబడ్డాయి. వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి వద్ద కొనుగోలు చేసినట్లు అంగీకరించారని ఆయన ఎస్ఐ తెలిపారు. వీటి విలువ రూ.లక్ష ఉంటుందని వెల్లడించారు. మండల వ్యవసాయ అధికారి ఫిర్యాదు మేరకు ఈ ఇద్దరితో పాటు, వారికి విక్రయించిన వ్యక్తిపైనా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మందమర్రి ఏఎస్ఐ కే మల్లేశ్, కానిస్టేబుళ్లు జే విశ్వనాథ్, సురేందర్, చైతన్య కుమార్‌ను మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి అభినందించారు.

## ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

రెబ్బెన, జూన్ 20 : రెబ్బెన మండల కేంద్రానికి చెందిన ధర్మ పవన్ (22) శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మ చంద్రకళ-వెంకటేశ్ దంపతులకు ఇద్దరు కొడుకు, ఇద్దరు కూతుళ్లు, పెద్ద కొడుకు ధర్మ పవన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై, పనులు కూడా సరిగా చేయడంలేదు. పద్ధతి మార్చుకోవాలని పలుమార్లు కుటుంబ సభ్యులు చెప్పినా వినలేదు. 19వ తేదీ గురువారం రాత్రి తాగిన మత్తులో ఇంటికి వచ్చి, అన్నం తిన్నాడు. పక్కనే ఉన్న భారతి ఇంటికి వెళ్లి పడుకుంటానని చెప్పి వెళ్లాడు. కొడుకు పవన్‌ను చూసేందుకు తల్లి చంద్రకళ వెళ్లగా, ఉరేసుకొని కనిపించాడు. చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బ్లాక్ మెయిల్ చేసిన విలేకరిపై కేసు

జన్నారం, జూన్ 20 : మండలంలోని ఐటీఐ ప్రిన్సిపాల్ బండి రాములును బ్లాక్ మెయిల్‌కు పాలడి, రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసిన సూర్యరేఖా దినపత్రి విలేకరి జమీర్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గొల్లపెల్లి అనూష తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 16న ఐటీఐ కళాశాలకు వచ్చిన విలేకరి, ప్రిన్సిపాల్‌ను డబ్బు ఇవ్వాలని అడిగారు. అందుకు ఆయన నిరాకరించడంతో పత్రికలో కథనాలు రాస్తానని బెదిరించి, తప్పుడు వార్త ప్రచురించాడు. కాగా, ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

రెబ్బెన, జూన్ 20 : పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ గ్రామానికి చెందిన ఘనపురం కృష్ణమూర్తి (55) బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ గ్రామానికి చెందిన కృష్ణమూర్తి కిరాణా దుకాణం నడుపుకుంటున్నాడు. బుధవారం ఎల్లూర్ గ్రామం నుంచి ఆసిఫాబాద్ వెళ్తుండగా, రాళ్లపేట గ్రామ శివారులో రోడ్డుపై నిలిపిన ట్రాక్టర్‌ను వెనుకవైపు నుంచి ఢీ కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడగా, స్థానికులు కాగజ్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మంచిర్యాల ప్రైవేట్, ఆ తర్వాత కరీంనగర్‌లోని సన్‌షైన్ దవాఖానకు తీసుకెళ్లారు. కాగా, పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కొడుకు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## విచారణ, నివేదిక సమర్పణ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 20 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి రావూరి శ్రీనివాస్ రావు తప్పుడు ధ్రువీకరణ పత్రంతో ఉద్యోగం చేస్తున్నాడని పలు పత్రికల్లో వచ్చిన కథనాలు, దరఖాస్తుల ప్రకారం పూర్తి విచారణ చేసినట్లు అదనపు కలెక్టర్ ఎం డేవిడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి చర్యల కోసం కలెక్టర్ ద్వారా డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్-హైదరాబాద్‌కు ఈ నెల 9వ తేదీన నివేదిక సమర్పించినట్లు ఆయన వెల్లడించారు.

## ట్రాఫిక్ నియమాలపై అవగాహన

శ్రీరాంపూర్, జూన్ 20 : శ్రీరాంపూర్‌లో బస్టాండ్ వద్ద శుక్రవారం విశ్వశాంతి స్కూల్ విద్యార్థులకు సీఐ వేణుచందర్ పర్యవేక్షణలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన నిర్వహించారు. పిల్లలు బైక్ నడిపితే వారి తల్లిదండ్రులకు కూడా శిక్ష విధిస్తున్నట్లు తెలిపారు. అతివేగంగా డ్రైవింగ్ చేయడం మానుకోవాలన్నారు. ఎస్ఐ సంతోష్, పోలీసులు పాల్గొన్నారు.

భీమారం, జూన్ 20 : భీమారం జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ఎస్ఐ శ్వేత ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్, జూన్ 20 : రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్ఆర్కే పాఠశాల విద్యార్థులకు వినూత్న పద్ధతిలో ట్రాఫిక్ నియమాలపై ఎస్ఐ రాజశేఖర్ అవగాహన కల్పించారు. విద్యార్థులతో పోలీసులు డ్యూటీ చేస్తున్నట్లుగా (డ్రిల్) వారికి అర్థమయ్యేలా చూపించారు. పట్టణ రెండో అదనపు ఎస్ఐ లలిత, ఉమెన్స్ హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య, కానిస్టేబుల్ శ్రీధర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 20 : అంతర్జాతీయ యోగా దినోత్సవం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఘనంగా నిర్వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని, నిత్యం కొంత సమయం కేటాయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. యోగా దినోత్సవం విజయవంతం చేసే దిశగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు.

## ఆయిల్ పాం తోటల పరిశీలన

కాగజ్‌నగర్, జూన్ 20 : కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామంలోని ఆయిల్ పామ్ తోటలను హార్టికల్చర్ అధికారి సుప్రజ శుక్రవారం పరిశీలించారు. నాలుగేళ్ల చెట్లను పరిశీలించి, రైతులు పాటించవలసిన వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు. అధికారులు సూచించిన వ్యవసాయ పద్ధతులు పాటించి ఆర్థికంగా ఎదగాలని రైతులకు సూచించారు. ఆమె వెంట కంపెనీ సీఈవో ఉదయ్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ రమేశ్ తదితరులు ఉన్నారు.

## క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, జూన్ 20 : శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో శుక్రవారం కార్మికులకు క్వార్టర్ల కేటాయింపునకు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీవైజీఎం అనిల్‌కుమార్, డీవైసీఎంవో డాక్టర్ రమేశ్‌బాబు, సివిల్ ఈఈ భరత్‌భూషణ్ పాల్గొని, మెడికల్ గ్రౌండ్స్ ప్రాతిపదికన ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించి, క్వార్టర్లు కేటాయించారు. డీవైపీఎం దేవేందర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ లక్కాకుల శ్రీధర్ పాల్గొన్నారు.